# ఉన్నతులు

కె. కె. రఘునందన



జీవితం ఎంత 'చిత్రమైంది' - ఇలా సుందరం అనుకోవటం ఆ రోజుల్లో ఎన్నోసారో!

వేదాంతిలా నిర్లిప్తమైన చిరునవ్వు కదలాడి క్షణంలో అది కూడా కనిపించటం మానేసింది.

కిటికీలోంచి బయటికి చూసాడు సుందరం!

చిన్న వాన తుంపర ... ఉదయం నుండి అలాగే కురుస్తూంది' చిన్నప్పుడయితే ఎంచక్కా యిలాంటి వానలో తడిసేవాడు తాను!

ప్చ్! ఆ రోజులు పారిపోయాయి. నెత్తి మీదికి బాధ్యతలు ఎక్కికూర్చున్నాయి. రాను రాను సమస్యలు పుట్టలో చీమల్లా పుట్టుకొస్తున్నాయి.

సుందరానికి ఒకటే దిగులుగా ఉంది.

తానింత మనిషై వుండి ఎవరి బ్రతుకుల్నీ ఓ ఒడ్డుకి చేర్చలేకపోయాడు!

పిల్లలు ముగ్గురే!

పెద్దది ఆడపిల్ల సుగుణ - మిగతా వాళ్ళు రవి - రామం!! కానీ ఆ ముగ్గురే ముప్పైమందిలా భారమైనారు!

రవి రామాలను చదివించడమైతే చదివించగలిగాడు కానీ, వాళ్ళ బ్రతుకుల్ని స్థిరం చేయలేకపోయాడు

ఎవరి కాళ్ళు పట్టుకుని ఉద్యోగం యిప్పించమని అడిగినా - వాళ్ళ నుండి వచ్చిన మాట 'లంచం'?

ఏది! తన దగ్గర అంత డబ్బు!!

"ఒరే! రవీ, రామం!! మీ యిద్దరికీ నే చెప్పేది ఒక్కటేరా! మంచి ఉద్యోగం, హోదా ఆశించటం డిగ్రీలు పొందిన మీకు సహజం! అయితే పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను దృష్టిలో పెట్టుకుని మనం అందరిలాగా 'ఉద్యోగం రాలేదు' అని నిరాశ చెందటంకంటే ఏదో ఒక చిన్న నౌకరీ సంపాదించుకోనటం మంచిది" అని చెప్పాడు - అది బాధపడుతూనే.

తండ్రి మాటల్లో వాస్తవం అవగాహన పరుచుకున్నారేమో ఆ రోజు నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

రవి - రామం చెప్పుల షాపులో చేరారు.

అప్పుడు వారిని చూసిన సుందరానికి కొద్దెయినా సంపాదిస్తున్నారన్న సంతోషం - వారి అర్హతలకు తగిన ఉద్యోగం రానందుకు కాస్త జాలి కల్గినాయి.

తనే డబ్బు నిలవేసి ఉంటే - వాళ్ళకి యింతకంటే రాజాల్లాంటి వుద్యోగాలు దొరికేవి.

ప్చ్! పొదుపు!

ముచ్చటగా మూడే అక్షరాల మాటయినా - దాన్ని పాటించడానికి ఎంత నియమం ఉండాలి.

రేపు గురించి ఆలోచించే మనిషి - తప్పక పొదుపు చేస్తాడు. కాని ఆ ముందు చూపులేక పోబట్టే - బడి పంతులుగా వుద్యోగం చేసినంత కాలం సర్దాగా ఖర్చులు చేసేసి చివరికి రిక్తహస్తాల్తో మిగిలాడు

"ఏమండీ! మనం ఎంత ఖర్చు చేస్తున్నాసరే మన భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని - ప్రవర్తించాలి కాబట్టి జీతంలో నెలకి పది రూపాయలైనా కట్టండి పోస్టాఫీసులో వడ్డీ బాగానే వుంటుందిట." అని పొదుపు అవసరాన్ని హెచ్చరిస్తూ రాజ్యం అనేది

అదేంటో గాని అర్ధాంగి మాటలు అంత రుచించేవి కావు. ఆ పది రూపాయలు వుంటే - ఐదు ప్యాకెట్ల సిగరెట్లో లేక రెండు సినిమాలో వస్తాయనే ఆశపడేవాడు.

కొంతకాలం గడచింది

రవికి ఏడేళ్ల ప్రాయంలో తాటి చెట్టు ఎ... పడిపోతే - హాస్పటల్‌లో జాయిన్ చెయడా... మిగతా ఖర్చులకు - అప్పు చెయవలసి వచ్చింది

అవే తను దాచి వుంటే? అన్న ఆలో... స్ఫురించింది ఆ సంఘటన తరువాత పొ...



వెయ్యాలనుకున్నాడు కాని విలాసాలు కళ్ళ ముందు నర్తించేసరికి - పొదుపు చేయాలనే యోచన దూరంగా విసిరికొట్టబడింది

కిటికీలోంచి ఒలిపిరి కొట్టింది

మొహం మీద పడ్డ తుంపరల్ని తుడుచుకున్నాడు సుందరం ఆలోచనల్లోంచి బయటపడి.

గదిలో చీకటిగా వున్నా - దీపం వెల్గించాలనే ప్రయత్నం కూడా చేయలేదు

ఏమండి తలుపు కిర్రుమంది

తల త్రిప్పాడు

రాజ్యం"

అయ్యో నా రాత అదేంటండి' అలా చీకట్లోనే కూర్చుని ఆలోచిస్తున్నారు"; అని లైటు వేసింది.

వెలుగు చూడని ఆలోచనలకి చీకటే మంచిది నిరసంగా పలికాడు సుందరం

మీ మాటల్లోనే నాకంతా అర్థం అయిందిలెండి. సుగుణ వచ్చి అప్పుడే వారం అయింది. కనీసం ఉత్తరమైనా వ్రాస్తే 'అంది పొడిగా దగ్గి

'హు! ఉత్తరం!! అందులో ఏం వ్రాయమంటావు" తిరిగి భార్యనే ప్రశ్నించాడు.

'అదికాదండి' మర్యాదకోసం కొద్దికాలం ఆగితే ఎల్లి చేత పంపిస్తామని రాస్తే బాగుంటుందని" సూచించింది రాజ్యం

'ఔన్నిజమే! కాని' ఇప్పుడున్న పరిస్థితిలో నాకేముందని - అల్లుడికి భరోసా యివ్వను. హామి యిస్తే ఖచ్చితంగా జరిపి తీరాల్సిందే రెండువేలంటే మాటలా మనబోటి వారికి - రాజ్యం! అన్నీ తెలిసిన నువ్వు కూడా!" బాధగా పలికాడు కణతలు రుద్దుకుంటూ.

'అయితే ఏం చేద్దాం!" ఆమె కూడా భర్తలాగే బాధపడుతూంది.

వారిరువురి యోచనలు - ఒకేలా సాగుతాయి ఎలా అన్న ప్రశ్న వారి అంతరంగంలో కందిరీగలా 'గి' పెడుతోంది.

వారి ఒక్కగానొక్క కూతురు సుగుణ. ఆమెని మెట్టినింట్లో పాదం మోపించగలిగారు కాని - ఆ పాదం తమ యింట్లోనే ఆరు నెల్లు తిరక్కుండా పెడుతుందని - అదే పాదం తమ గుండెల్ని బలంగా నలిపేస్తుందని కాని ఊహించలేదు.

అల్లుడి కోరికలు రాను రాను అధికం అయిపోతున్నాయి. హీరో మెజిస్టిక్, సాన్యో టేప్ రికార్డర్, ఆల్విన్ ఫ్రిజ్ . . యింతకాలం అప్పో, సప్పో చేసి - అల్లుడి కోరికల్ని బ్రతికించారు.

కాని కూతురి కళల్లో నీటికి ఆనకట్ట వేయలేకపోయారు.

అల్లుడు అప్పుల్లో ఉన్నాట్ట . . డబ్బు కావాలిట.

వారం క్రితం కూతురు తెచ్చిన కబురు ...

ఆ రోజు మొదలు అన్నం నోటికి వెళ్ళలేదు ఆలోచనలే కడుపులో ఆకల్ని చంపేసాయి. బుర్రని పాడు చేసాయి.

వారిద్దరూ కొట్టుమిట్టాడుతుండగానే తలుపు తోసుకుని వెళ్ళింది సుగుణ.

కన్నీటి చారికలు బుగ్గలపై...

"అమ్మా! మీ యిద్దరికీ నేను బరువైపోయానమ్మా! నాకు పెండ్లిచేసి ఆర్థికంగా దిగజారిపోయిన మీరు మా వారి కోరికలకి మరింత కృంగిపోతున్నారు. మానసికంగా క్షోభిస్తున్నారు. నేను చచ్చిపోతే అని బావురుమంది.

"అంత మాటనకమ్మా సుగుణా! మేం బ్రతికి వుండగానే నువ్వు చావటమా! దానివల్ల మా పేగుల్లో మరింత ఆరని చిచ్చు ఔతుంది. దయచేసి అటువంటి ఘోరానికి ఒడిగట్టకు. ఈ వెధవ బడిపంతులు వుద్యోగంలో నేనేం సంపాదించలేక పోయాను. ఉన్ననాడు ముందు చూపుతో ప్రవర్తించి ఉంటే యిలా మన బ్రతుకులు వీధినపడేవి కావు" అని ఊరడించారు

తండ్రి అలా ఊరడించినా మనస్సు శాంతించలేదు సుగుణకి.

అంతటి వ్యధ గుండెని కొండ చిలువలా చుట్టేస్తున్నా! ఏడుపుని రాకుండా ముని పళ్లతో నొక్కేసాడు సుందరం

సుగుణ కళ్ల నుండి బొట్లు బొట్లుగా నీళ్లు రాలుతున్నాయి.

మౌనం పులుముకుంది.

సుందరం కళ్ల ముందు అల్లుడు భరత్ మెదిలాడు.

అనుక్షణం విలాసాలతో గడపటమే నాగరికమనుకునే - యితరుల్ని ఏదో విధంగా పైసాచికంగా హింసించే ఆధునిక రాక్షసుడు భరత్.

ముట్టచెప్పవలసిన కట్నం యివ్వలేకపోయినందుకు - భరత్ క్షణం క్షణం కూతుర్ని పుట్టింటికి తోసేస్తూ- తమని శిక్షిస్తున్నాడు.

భరత్ వృత్తి ఆఫీసర్. ప్రవృత్తి రాక్షసత్వం.

వస్తున్న రెండు వేల జీతం ఏమౌతుంది?!

ఎంతలా ఖర్చు చేసినా మిగల్చొచ్చు.

# ఉన్నతులు

కాని - వ్యసనాలకి బానిసయిన అతనికి డబ్బు మంచి నీళ్లప్రాయమే కావచ్చు. తన వ్యామోహంలో ఎవర్నీ లక్ష్యపెట్టడు.

కేవలం భార్య తెచ్చే డబ్బు మీదే అపేక్ష ..

అది ప్రతిసారి - వేడి రక్తం రుచి మరిగిన పులికి మల్లే డబ్బు రుచి మరిగాడు. అందుకే సుగుణని వేధిస్తున్నాడు.

అయితే కూతురి ముఖం చూసి - ఆమె కాపురం కళకళ్లాడాలనే ఆశతో అన్ని భరిస్తున్నాడు.

సుందరం గతంలోంచి బయటకు వచ్చేసరికి - అంతవరకూ కనురెప్పల లోపల పొదిగివున్న నీటి బిందువులు నేలరాలాయి.

ఎలాగైనా సుగుణని- భర్త వద్దకు పంపాలి. భర్త ఎటువంటి వాడైనా - లోకధర్మంగా మెట్టినింటికి పంపడం ఉచితం.

ఆలోచిస్తుండగానే వానలో తడుచుకుంటూ వచ్చారు రవి, రామం.

రాజ్యం కొడుకులిద్దరికీ తువ్వాళ్లందించింది.

కాంతిలేని ముగ్గురి వదనాల్లోకి వింతగా తిలకించారు వాళ్లు.

"నాన్నా! ఏమైంది మీకు! ఎందుకలా వున్నారు." అడిగాడు రవి.

రాజ్యం నోరు మెదపబోయింది.

వారిస్తూ - "రాజ్యం! వాళ్లు పసివాళ్లు - వారికి మన బాధలు చెబితే ఏమిటి సుఖం. వారి మనసుల్ని కష్టపెట్టినట్లు ఔతుంది." అని ప్రాధేయంగా చూసాడు సుందరం.

"అమ్మా! నాన్న - మాటలకేంగాని! ఏమిటి సమస్య? చెప్పమ్మా!" ఒత్తిడి చేసాడు రామం.

కొడుకులిద్దరి ప్రోద్బలంతో చెప్పక తప్పలేదు.

మొదట - సుగుణ ఎందుకొచ్చింది చెప్పింది

'ఒరే! సుగుణ కాపురం చల్లగా బాగుండాలనే మనందరి ఆశరా? కాని ప్రస్తుతం సుగుణ భర్త అవసరాన్ని తీరుస్తే తప్ప దానికి మెట్టినింటికి వెళ్లే అవకాశంలేదు." అని ఏడ్చింది రాజ్యం

"అమ్మా! మమ్మల్ని పెంచి పోషించినందుకు - యిప్పటికేదో ఉద్యోగాలు చేస్తూ ఉన్నాం. మన కష్టాలేమిటో మాకు తెలిని పరిస్థితి అయిపోయింది. ఉదయం వెళ్లి ఏ రాత్రికో వస్తాం. నాన్నగారి బాధ్యతలు మేం మోయటానికి ఎప్పుడూ సిద్ధమే'అయితే సుగుణ సమస్య మాకు తెలీదు. లేకపోతే ఏనాడో తీర్చేవాళ్లం" అని ఆగాడు రవి

"అయినా మీరు తెచ్చే జీతం రాళ్లతో ఏం చేయగలరు? పొదుపు చేయటం కూడా మీకు కష్టమేరా!" అని నిట్టూర్చాడు సుందరం.

"నాన్నా! అలా అనకండి! మనిషి నిరాశావాదం వైపు ప్రయాణిస్తే ఏ పనీ చేయలేడు చిన్న ఆధారం దొరికితే చాలు ఒడ్డుకి పోగలమనే మనిషి. కొండల్నైనా పిండి చేసే శక్తి సంపాదిస్తాడు. నిజంగా ఓ విషయం చెబితే మీరాశ్చర్యపోతారు అని చెప్పాడు రామం.

"ఏమిటి?" ప్రశ్నించాడు సుందరం ఆశ్చర్యంగా.

"రవీ నేనూ కూడా చిన్న ద్యోగాలే చేస్తున్నాం - చిన్న మొత్తాలే అందుకుంటున్నాం. అయినా నెల నెల పొదుపు చేస్తున్నాం. అయిదేళ్లు క్రితం కొట్లో ప్రవేశించిన మొదట్లో మా యజమాని చమన్‌లాల్ మమ్మల్ని పిలిచాడు.

"అబ్బాయిలూ మీ జీతంలో ఇరవై రూపాయలు చొప్పున మినహాయిస్తాను. అది మీ పేర పోస్టాఫీసులో వేస్తాను. చివర మీకు చాలా వస్తుంది. మీకిప్పుడు యిది కొంచెం కష్టమనిపించినా ముందు జాగ్రత్త కోసం చెబుతున్నాను! అన్నారు. సరేనన్నాం. దాని ఫలితం యింతకాలానికి ఫలించింది. వారం క్రితమే అయిదువేలయింది. రేపు పోస్టాఫీసుకి వెళ్లి తీసుకుంటాం" అని ఆగారు.

సుందరం రవి మాటలకి నిర్ఘాంతపోయాడు.

రామం -"సుగుణకి కావలసిన రెండు వేలు యిచ్చి పంపండి ఈసారికి! భరత్‌ని మార్చే ప్రయత్నం తర్వాత చేద్దాం" అన్నాడు.

ఒకప్పుడు తను పది రూపాయలైనా పొదుపు చేయలేకపోయాడు.

కాని వాళ్లు చేస్తున్న చిరుద్యోగాల్లో వస్తున్న జీతంలోనే పొదుపు చేసారు.

ఎంత వ్యత్యాసం.

కాలంలో ఎంతటి మార్పు?

తరంలో ఎంతటి అంతరం?!

తనకన్నా బాగా ఎదిగిపోయారు.

అదే చాలు తనకి

సుందరం కళ్లకి కొడుకులిద్దరు రెండు ఎత్తైన ఎవరెస్టు శిఖరాల్లా ఉన్నతంగా కనిపించారు.

బయట వర్షంతో పాటే సుందరంలో కూడా బాధ తగ్గుముఖం పట్టింది. □

